క్లుప్తంగా

అందుబాటులోకి విజయ వనం


టికెట్ కౌంటర్‌ను పరిశీలిస్తున్న డీఎఫ్‌ఓ శివశంకర్ రెడ్డి

కర్నూలు కల్చరల్: విజయవనం పుల్లయ్య పార్క్‌ను సందర్శకులకు అందుబాటులోకి తెచ్చామని జిల్లా అటవీ శాఖ అధికారి పల్లె శివ శంకర్‌రెడ్డి తెలిపారు. గురువారం ఆయన విజయ వనం పుల్లయ్య పార్క్‌ను సందర్శించారు. మొదటి రోజు 34 మంది సందర్శకులు పార్క్‌ను సందర్శించారన్నారు. టికెట్‌ల రూపంలో రూ.680 సమకూరిందన్నారు. సందర్శకుల తాడికి పెరిగే అవకాశం ఉందన్నారు. వారికి ఎలాంటి ఇబ్బందులు లేకుండా అన్ని వసతులు కల్పిస్తామన్నారు.

పేదలకు స్థలాలు ఇవ్వాలి

కర్నూలు(సెంట్రల్): పేదలకు ఇళ్ల స్థలాలు ఇవ్వాలని సీపీఐ జిల్లా కార్యదర్శి బి.గిడ్డయ్య, టీడీపీ నియోజకవర్గ ఇన్‌చార్జ్ టీజీ భరత్ డిమాండ్ చేశారు. గురువారం సీపీఐ కార్యాలయం సమీపంలోని కేసీ కెనాల్‌పై ఇంటి స్థలం లేని పేదలు, జగనన్న కాలనీలు, టిడ్కో గృహాలు మంజూరైన లబ్ధిదారులతో వారు సమావేశమయ్యారు. ఈసందర్భంగా వారు మాట్లాడుతూ జగనన్న కాలనీలు, టిడ్కో గృహాల్లో ఇళ్ల నిర్మాణం చేపట్టే లబ్ధిదారులకు ఇచ్చే వాటాను ప్రభుత్వం పెంచాలన్నారు. ప్రస్తుతం లబ్ధిదారులకు ప్రభుత్వం రూ.1.80 లక్షలు ఇస్తోందని, దానిని రూ.5 లక్షలకు పెంచాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో నాయకులు పి.రామకృష్ణారెడ్డి, మునెప్ప, మహేష్ పాల్గొన్నారు.

నూతన సార్జెంట్‌గా శ్రీనివాసులు


శ్రీనివాసులుకు ఉత్తర్వులు ఇస్తున్న సూపరింటెండెంట్ డాక్టర్ వెంకటరంగారెడ్డి

కర్నూలు(హాస్పిటల్): కర్నూలు ప్రభుత్వ సర్వజన వైద్యశాల నూతన సార్జెంట్‌గా ఎస్. శ్రీనివాసులును నియమిస్తూ గురువారం ఆసుపత్రి సూపరింటెండెంట్ డాక్టర్ వి. వెంకటరంగారెడ్డి ఉత్తర్వులు జారీ చేశారు. పూర్వ సార్జెంట్ బి.వేణుగోపాల్ నుంచి ఎస్. శ్రీనివాసులు బాధ్యతలు స్వీకరించారు. ఆసుపత్రిలోని పలు విభాగాల్లో రోగులకు ఇబ్బంది కలగకుండా ఎంఎన్‌ఓలతో సక్రమంగా విధులు నిర్వహించేలా చూసుకోవాలని డాక్టర్ వెంకటరంగారెడ్డి సూచించారు. ఆసుపత్రిలోని ఎంఎన్‌ఓలకు ప్రతి మూడు నెలలకోసారి డ్యూటీ రోస్టర్ వేసేలా చర్యలు తీసుకోవాలని ఆర్ఎంఓను ఆదేశించారు.

కరువు సహాయక చర్యలు చేపట్టాలి



మాట్లాడుతున్న బి.గిడ్డయ్య

కర్నూలు(సెంట్రల్): జిల్లాలో కరువు నెలకొన్న నేపథ్యంలో వెంటనే సహాయక చర్యలు చేపట్టాలని సీపీఐ జిల్లా కార్యదర్శి బి.గిడ్డయ్య ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. గురువారం సీపీఐ కార్యాలయంలో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ ఖరీఫ్, రబీ సీజన్లలో అన్నదాతలు పంటలన్నీ వర్షాలు లేక ఎండిపోవడంతో తీవ్ర నష్టం వాటిల్లిందన్నారు. ఇన్‌పుట్ సబ్సిడీని విడుదల చేయాలని కోరారు. కరువు సహాయక చర్యలు చేపట్టాలని సీపీఐ ఆధ్వర్యంలో ఫిబ్రవరి 5న జిల్లాలోని అన్ని తహసీల్దార్ల సమావేశంలో నాయకులు పి.జగన్నాథం, ఎస్.మునెప్ప, పి.రామకృష్ణారెడ్డి పాల్గొన్నారు.

మార్కెట్ యార్డులో ఘర్షణ

కర్నూలు(అగ్రికల్చర్): స్థానిక వ్యవసాయ మార్కెట్ యార్డులో గురువారం చిన్నపాటి ఘర్షణ చోటుచేసుకుంది. కర్ణాటక రాష్ట్రం బీజాపూర్ జిల్లా కిందిగేరి నుంచి కొందరు రైతులు వామును కర్నూలు మార్కెట్‌లోని కమీషన్ ఏజెంట్ షాపు నెంబరు-32కు తెచ్చారు. హమాలీలు వాహనాన్ని షెడ్‌లోకి తీసుకెళ్లడాన్ని అక్కడే ఉన్న జూనియర్ మార్కెటింగ్ సూపర్‌వైజర్(జేఎంఎస్) మద్దయ్య, యార్డు అసిస్టెంట్లు అడ్డుకున్నారు. కాగా హమాలీలువాహనాన్ని పైకి తీసుకెళ్లారు. ఇదంతా కమీషన్ ఏజెంట్ లక్ష్మీనారాయణ ప్రోద్బలంతోనే జరుగుతుందని జేఎంఎస్ ఆయనతో వాదనకు దిగారు. దీంతో జేఎంఎస్ మద్దయ్య తనపై చేయిచేసుకున్నారని 4వ పట్టణ పోలీసులకు ఫిర్యాదు చేశారు. కమీషన్ ఏజెంట్ల సంఘం నేతలు మార్కెట్ కమిటీ చైర్మన్ ప్రభాకర్‌రెడ్డి, సెక్రటరీ గోవిందు దృష్టికి జేఎంఎస్ మద్దయ్య వ్యవహారాన్ని తీసుకెళ్లగా విచారించి చర్యలు తీసుకునేందుకు రెండు రోజులు సమయం ఇవ్వాలని చైర్మన్ కోరడంతో కమీషన్ ఏజెంట్ల సంఘం నేతలు అంగీకరించారు.

ఒక్క ఓటుతో మహిళల జీవితాల్లో వెలుగులు

- మేయర్ బీవై రామయ్య, ఎమ్మెల్యే హఫీజ్‌ఖాన్
- ఘనంగా 4వ విడత వైఎస్ఆర్ ఆసరా సంబరాలు
- ముఖ్యమంత్రి చిత్రపటానికి పాలాభిషేకం చేసిన మహిళలు


గ్రూపు సభ్యులకు మెగా చెక్కు అందజేస్తున్న బీవై రామయ్య, హఫీజ్‌ఖాన్


హాజరైన పొదుపు గ్రూపు మహిళలు

కర్నూలు (టౌన్): ఒక్క ఓటుతో మహిళల జీవితాల్లో వెలుగులు నింపిన ఘనత ముఖ్యమంత్రి వైఎస్ జగన్మోహన్‌రెడ్డికే దక్కుతుందని నగర మేయర్ బీవై రామయ్య అన్నారు. గురువారం స్థానిక ఎగ్జిబిషన్ మైదానంలో నగరపాలక సంస్థ, పట్టణ పేదరిక నిర్మూలన సంస్థ సంయుక్త ఆధ్వర్యంలో 4వ విడత వైఎస్ఆర్ ఆసరా సంబరాలు ఘనంగా నిర్వహించారు. స్వయం సహాయక సంఘ మహిళలు ముఖ్యమంత్రి చిత్ర పటానికి పాలాభిషేకం చేశారు. జ్యోతి ప్రజ్వలనతో కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా మేయర్ మాట్లాడుతూ జగనన్న చెప్పాడంటే కచ్చితంగా చేస్తాడన్నారు. నాలుగున్నరేళ్లుగా మహిళలకు అనేక సంక్షేమ ఫలాలు ఇంటి ముంగిటకే అందిస్తున్నారన్నారు. పసుపు కుంకుమ పేరుతో చంద్రబాబునాయుడు మహిళలకు శఠగోపం పెట్టారన్నారు. నిజాయితీ, విశ్వసనీయత లేని చంద్రబాబును, టీడీపీని వచ్చే ఎన్నికల్లో తరిమి కొట్టాలన్నారు. కర్నూలు ఎమ్మెల్యే హఫీజ్‌ఖాన్ మాట్లాడుతూ కర్నూలు నగరంలో పండుగ వాతావరణం కనబడుతుందన్నారు. నగరంలోని 3,015 పొదుపు గ్రూపులకు రూ.20.15 కోట్లు నేరుగా వారి అకౌంట్లలో జమ అయ్యాయన్నారు. జగనన్న ప్రభుత్వంలో వివక్ష, లంచాలు లేకుండా, కార్యాలయాల చుట్టూ తిరగకుండా వలంటీర్ల వ్యవస్థ ద్వారా మహిళలకు సంక్షేమ ఫలాలు అందుతున్నాయన్నారు. ప్రతి ఒక్కరికీ మేలు చేస్తున్న జగనన్న ప్రభుత్వాన్ని మరోసారి ఆశీర్వదించాలని కోరారు. సమావేశంలో నగరపాలక అడిషనల్ కమిషనర్ రామలింగేశ్వర్, వైఎస్సార్‌సీపీ నగర అధ్యక్షురాలు సిద్రా సత్యనారాయణమ్మ, మెప్మా పీడీ నాగశివలీల, డిప్యూటీ మేయర్ నాయకల్లు అరుణ, వైఎస్సార్ సేవాదళ్ జిల్లా అధ్యక్షులు కేదార్‌నాథ్, కార్పొరేటర్లు పాల్గొన్నారు.

జగనన్న మేలు మరిచిపోం

చంద్రబాబు నాయుడు చెప్పడంతోనే బ్యాంకు రుణాలను తిరిగి చెల్లించలేదు. అప్పు పెరిగిపోవడంతో బ్యాంకు నుంచి ఫోన్లు వచ్చాయి. దీంతో తీవ్ర ఇబ్బందులు పడ్డాం. ఆర్థికంగా ఇబ్బందులు పడ్డాం. జగనన్న ఇచ్చిన మాట ప్రకారం అధికారంలోకి రాగానే వైఎస్సార్ ఆసారాతో ఆదుకున్నాడు. విడతల వారీగా ఇప్పటి వరకు నాలుగు సార్లు ఖాతాకు నగదు జమ చేశారు. ఇప్పుడు ఆనందంగా ఉంది. జగనన్న చేస్తున్న మేలును మరిచిపోం.

– గౌసియాబేగం, లక్ష్మీనగర్

అప్పు తీరిపోయింది

ఎన్నికల ముందు జగనన్న చెప్పినట్లుగానే డబ్బు వేస్తున్నారు. ఇప్పటికి నాలుగు విడతలుగా నా ఖాతాలో జమ కావడంతో బ్యాంకు రుణం తీరిపోతుంది. దీని వల్ల కొత్తగా రుణాలు తీసుకోవడానికి అవకాశం వచ్చింది. జగనన్నకు కృతజ్ఞతలు.

– ఇందిర, వడ్డగేరి

రిక్రూట్‌మెంట్ నిలిపివేత

కర్నూలు(హాస్పిటల్): జిల్లా కలెక్టర్ ఆదేశాల మేరకు ఎన్‌టీఈపీలోని గత ఆగస్టు 30న క్షయ వ్యాధి నివారణ కేంద్రంలో ఇచ్చిన నోటిఫికేషన్ రిక్రూట్‌మెంట్ నిలిపివేసినట్లు జిల్లా లెప్రసీ, ఎయిడ్స్, టీబీ అధికారి డాక్టర్ ఎల్.భాస్కర్ గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. ఇందులో మెడికల్ ఆఫీసర్, డిస్ట్రిక్ట్ ప్రోగ్రామ్ కో ఆర్డినేటర్, డిస్ట్రిక్ట్ పీపీఎం కో ఆర్డినేటర్, డాట్స్ ప్లస్ టీబీ, హెచ్ఐవీ సూపర్‌వైజర్, ల్యాబ్ టెక్నీషియన్, సీనియర్ ట్రీట్‌మెంట్ సూపర్‌వైజర్, సీనియర్ ట్రీట్‌మెంట్ ల్యాబ్ సూపర్‌వైజర్, ట్యూబరోకులోసిస్ హెల్త్ విజిటర్, అకౌంటెంట్ పోస్టులు ఉన్నాయన్నారు. కుటుంబ సంక్షేమ కమిషనర్ ఆదేశాల మేరకు ఎన్‌హెచ్‌ఎంలో ఉన్న కాంట్రాక్టు, అవుట్‌సోర్సింగ్ పోస్టులన్నీ ఆంధ్రప్రదేశ్ మెడికల్ సర్వీసెస్ రిక్రూట్‌మెంట్ బోర్డు వారు నిర్వహిస్తారన్నారు.

విఫ్స్ కార్యక్రమం తనిఖీ

కర్నూలు(హాస్పిటల్):రాష్ట్రీయ బాల స్వాస్థ్య కార్యక్రమం అధికారిణి హేమలత గురువారం నగరంలోని గడ్డ దిలో ఉన్న పట్టణ ప్రాథమిక ఆరోగ్య కేంద్రం పరిధిలోని దండిగేరిలో మోతీయ ఉర్దూ పాఠశాలలో నిర్వహిస్తున్న విఫ్స్ కార్యక్రమాన్ని తనిఖీ చేశారు. విద్యార్థులకు నులి పురుగులు, రక్తహీనతపై ఆమె అవగాహన కల్పించారు. నులిపురుగులు కడుపులో ఉన్నట్లయితే అతిగా ఆకలి వేయడం, ఆకలి లేకపోవడం, రక్తహీనత, దగ్గు, వికారం, వాంతులు తదితర సమస్యలు ఉంటాయన్నారు. పండ్లు, కూరగాయలు పరిశుభ్రంగా కడిగిన తర్వాతే వాటిని వినియోగించాలని సూచించారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు, సచివాలయ ఆరోగ్య కార్యకర్తలు, ఆశా కార్యకర్తలు పాల్గొన్నారు.

కర్నూలు సిటీ ఫారెస్ట్ టికెట్ ధరల్లో మార్పు

కర్నూలు కల్చరల్: కర్నూలు సిటీ ఫారెస్ట్ ప్రవేశం, వాహనాల పార్కింగ్, వన దర్శిని వాహనం టికెట్ ధరల్లో స్వల్ప మార్పులు చేసినట్లు అటవీ శాఖ జిల్లా అధికారి పల్లె శివశంకర్‌రెడ్డి గురువారం తెలిపారు. మార్చిన ధరలు ఇప్పటికే అమల్లోకి వచ్చాయన్నారు. సందర్శకులు మార్పును గమనించి సహకరించాలని విజ్ఞప్తి చేశారు.


కర్నూలు సిటీ ఫారెస్ట్ ముఖ ద్వారం

టికెట్ ధరల వివరాలు

	పాత రేట్లు		కొత్త రేట్లు	
	పిల్లలు	పెద్దలు	పిల్లలు	పెద్దలు
పార్క్‌లోకి ప్రవేశం	రూ.10	రూ.20	రూ.20	రూ.40
పార్కింగ్‌కు టూవీలర్స్		రూ.20	రూ.30	
త్రీ, ఫోర్ వీలర్స్		రూ.40	రూ.60	
వనదర్శిని వాహనం ఒక్కొక్కరికి		రూ.50	రూ.75	
వాకర్స్ నెలకు ఒక్కొక్కరికి		రూ.200	రూ.300	

ముగిసిన ప్రజాభిప్రాయ సేకరణ

కర్నూలు(అగ్రికల్చర్): రాష్ట్ర విద్యుత్ పంపిణీ సంస్థలు ప్రతిపాదించిన వార్షిక ఆదాయ అవసరాల నివేదికపై సోమవారం నుంచి మొదలైన ప్రజాభిప్రాయ సేకరణ గురువారం ముగిసింది. సోమవారం నుంచి బుధవారం వరకు విశాఖపట్టణం నుంచి విద్యుత్ పంపిణీ సంస్థల సీఎండీలు సంతోష్‌రావు, పృథ్వీతేజ్, ట్రాన్స్‌కో ఉన్నతాధికారులు, గురువారం ఏపీ ఏపీ జెన్‌కో అధికారులు తాము ప్రతిపాదించిన వాటి వివరాలను వీడియో కాన్ఫరెన్స్ ద్వారా వివరించారు. ఏపీఈఆర్‌సీ చైర్మన్ జస్టిస్ నాగార్జునరెడ్డి ఆధ్వర్యంలో ప్రతిపాదనలపై ఆన్‌లైన్‌లో ప్రజాభిప్రాయ సేకరణ చేపట్టారు. ఉమ్మడి కర్నూలు జిల్లా నుంచి సుమేర్ సోలార్ ప్లాంట్, సాయి అచ్యుత్ సోలార్ ప్లాంట్, క్రాంతి బ్రదర్స్ సోలార్ ప్లాంట్స్ ప్రతినిధులు కొన్ని సూచనలు చేశారు. తమపై గ్రిడ్ సపోర్టు చార్జీలు వేస్తుండటం వల్ల భారం పడుతోందన్నారు. సోలార్ విద్యుత్ ఉత్పత్తి చేసే వారిపై కేడబ్ల్యూహెచ్ బిల్లింగ్‌తో పాటు కేవీఏహెచ్ బిల్లింగ్ వేస్తున్నారన్నారు. రానున్న రోజుల్లో వినియోగదారులపై విద్యుత్ చార్జీల భారం పడే అవకాశం లేదని ఏపీఈఆర్‌సీ చైర్మన్ జస్టిస్ నాగార్జునరెడ్డి వీడియో కాన్ఫరెన్స్ ద్వారా స్పష్టం చేశారు. కర్నూలు, నంద్యాల, ఆదోని, డోన్ కేంద్రాలుగా వీడియో కాన్ఫరెన్స్ జరిగింది. కర్నూలు నుంచి ఎస్ఈ ఉమాపతి, కర్నూలు టౌన్ డీఈ చక్రపాణి పాల్గొన్నారు.



వీడియో కాన్ఫరెన్స్‌లో పాల్గొన్న ఎస్ఈ ఉమాపతి

ఆర్‌యూ సమస్యల పరిష్కారానికి చర్యలు


వీసీతో మాట్లాడుతున్న మేయర్ బీవై రామయ్య

కర్నూలు కల్చరల్: రాయలసీమ విశ్వవిద్యాలయంలో ఉన్న సమస్యల పరిష్కారానికి చర్యలు తీసుకుంటున్నామని వర్సిటీ వైస్‌చాన్స్‌లర్ ప్రొఫెసర్ బి.సుధీర్ ప్రేమ్ కుమార్ అన్నారు. గురువారం వర్సిటీలోని కాన్ఫరెన్స్ హాల్‌లో వివిధ విభాగాల హెచ్‌ఓడీలతో సమీక్ష నిర్వహించారు. సమస్యలను తీసుకొని ఒక్కొక్కటిగా పరిష్కరిస్తామన్నారు. ఉద్యోగులు అంకిత భావంతో విధులు నిర్వహిస్తూ వర్సిటీ అభివృద్ధికి సహకరించాలన్నారు. హాస్టల్స్ సమస్యలను మొదటి ప్రాధాన్యతగా తీసుకున్నామన్నారు. విద్యార్థులకు సరైన వసతులు కల్పిస్తామన్నారు. మెనూ ప్రకారం విద్యార్థులకు ఆహారం అందిస్తామన్నారు. హాస్టల్స్ ప్రొవిజినల్ సప్లయి టెండర్ గడువు ముగిసిందని, త్వరలో టెండర్లు పిలుస్తామన్నారు. విద్యార్థులకు తరగతులు రెగ్యులర్‌గా జరిగేలా అకడమిక్ అట్మాస్పియర్ మెరుగు పరుస్తామన్నారు. సమీక్షలో రిజిస్ట్రార్ వెంకట సుందరానంద పుచ్చ, ప్రొఫెసర్లు ఎన్.టి.కె.నాయక్, భరత్ కుమార్, ఇంజినీరింగ్ కళాశాల ప్రిన్సిపాల్ హరిప్రసాద్‌రెడ్డి పాల్గొన్నారు.

వైఎస్సార్ విగ్రహం ఏర్పాటు చేయండి

యూనివర్సిటీలో వైఎస్సార్ విగ్రహం ఏర్పాటు చేయాలని నగర మేయర్ బీవై రామయ్య.. వీసీ ప్రొఫెసర్ బి.సుధీర్ ప్రేమ్‌కుమార్‌ను కోరారు. గురువారం ఆయన వీసీని కలిసి పలు అంశాలపై చర్చించారు. వైఎస్ రాజశేఖర్ రెడ్డి సీఎంగా ఉన్న సమయంలో గ్రామీణ విద్యార్థులకు ఉన్నత విద్యను అందించాలనే లక్ష్యంతో జిల్లాకు ఒక యూనివర్సిటీని ఏర్పాటు చేశారని మేయర్ గుర్తు చేశారు. అలాంటి మహా నాయకుడి విగ్రహాన్ని వర్సిటీలో ఏర్పాటు చేయాలని వీసీకి విన్నవిచారు. కార్యక్రమంలో వైఎసోఆర్‌సీపీ కోడుమూరు నియోజకర్గ సమన్వయకర్త డాక్టర్ ఆదిమూలపు సతీష్, విద్యార్థి సంఘం జిల్లా అధ్యక్షులు ప్రశాంత్ పాల్గొన్నారు.

క్రీడా ఆణిముత్యం

- జాతీయ పరుగు పందెంలో రాణిస్తున్న వీణ
- రాష్ట్రస్థాయి 1,500 మీటర్ల పరుగు పందెంలో రెండు సార్లు గోల్డ్ మెడల్


బి.వీణాకుమారి

కర్నూలు(అర్బన్): జిల్లాలోని మంత్రాలయంలో పేద వ్యవసాయ కుటుంబంలో హనుమంతు, హేమలత దంపతులకు జన్మించిన బి.వీణాకుమారి క్రీడల్లో ప్రతిభ కనబరుస్తోంది. నగరంలోని ప్రభుత్వ సాంఘిక సంక్షేమ శాఖ కళాశాల బాలికల వసతి గృహం నెంబర్: 1లో ఉంటూ పరుగు పందెంలో రాణిస్తోంది. మంత్రాలయం జెడ్పీ ఉన్నత పాఠశాలలో 6వ తరగతి చదువుతున్న సమయంలో అప్పటి పీఈటీ అందించిన ప్రోత్సాహంతో చత్తీస్‌ఘడ్‌లో జరిగిన అండర్ 14, 16లో జాతీయ స్థాయి పరుగు పందెంలో రాష్ట్రం నుంచి పాల్గొని పలువురి ప్రశంసలు అందుకుంది. నగరంలోని బీ క్యాంప్ ప్రభుత్వ జూనియర్ కళాశాలలో ఇంటర్మీడియెట్ చదువుతున్న సమయంలో ప్రిన్సిపాల్ సాజన్య, కర్నూలు స్పోర్ట్స్ సెక్రటరీ హర్షవర్దన్ శిక్షణ, ప్రోత్సాహంతో వివిధ రాష్ట్ర, జాతీయ స్థాయి పోటీల్లో పాల్గొని అనేక మెడల్స్, సర్టిఫికెట్స్ అందుకుంది. పశ్చిమ గోదావరి జిల్లా ఏలూరులో జరిగిన రాష్ట్ర స్థాయి అథ్లెటిక్స్ పోటీల్లో వీణాకుమారి 1,500 మీటర్ల పరుగుపందెంలో బంగారు పతకాన్ని సాధించింది. నగరంలో ఇటీవల జరిగిన రగ్బీ పోటీల్లోనూ రన్నర్‌గా నిలిచింది. ప్రస్తుతం నగరంలోని కాంకర్ ఒకేషనల్ జూనియర్ కళాశాలలో మొదటి సంవత్సరం ఎంపీహెచ్‌డబ్ల్యూఓ కోర్సు చేస్తున్న వీణాకుమారి గత నెల 13న రాజంపేటలో జరిగిన 45వ ఏపీ స్టేట్ ఇంటర్ డిస్ట్రిక్ట్ హ్యాండ్‌బాల్ పోటీల్లో రజత పథకం సాధించి కర్నూలు జట్టును మూడవ స్థానంలో నిలిపింది. వీణాకుమారి ప్రతిభను గుర్తించిన వసతి గృహ సంక్షేమాధికారిణి బీ బెన్నమ్మ.. వివిధ రాష్ట్రాల్లో జరుగుతున్న క్రీడల్లో పాల్గొనేందుకు అవకాశం కల్పించడంతో పాటు అన్ని విధాలా ప్రోత్సాహాన్ని అందిస్తోంది.


వీణాకుమారి అందుకున్న సర్టిఫికెట్లు

నగర అభివృద్ధే ప్రధాన లక్ష్యం

- వైఎస్సార్‌సీపీ నంద్యాల, కర్నూలు జిల్లాల అధ్యక్షులు కాటసాని రాంభూపాల్‌రెడ్డి, బీవై రామయ్య
- 20వ వార్డులో అభివృద్ధి పనుల శిలాఫలకం ఆవిష్కరణ


అభివృద్ధి పనుల శిలాఫలకం ఆవిష్కరిస్తున్న వైఎస్సార్‌సీపీ జిల్లాల అధ్యక్షులు కాటసాని రాంభూపాల్‌రెడ్డి, బీవై రామయ్య

కల్లూరు : నగర అభివృద్ధే ప్రధాన లక్ష్యమని వైఎస్సార్‌సీపీ నంద్యాల జిల్లా అధ్యక్షుడు, పాణ్యం ఎమ్మెల్యే కాటసాని రాంభూపాల్‌రెడ్డి, కర్నూలు జిల్లా అధ్యక్షుడు, నగర మేయర్ బీవై రామయ్య అన్నారు. గురువారం కల్లూరు అర్బన్ 20వ వార్డు పరిధిలో నందికొట్కూరు రోడ్డులోని ఓమేగా ఆస్పత్రి నుంచి నంద్యాల రోడ్డు వరకు 100 మీటర్ల బీటీ రోడ్డు నిర్మాణ పనుల భూమిపూజ కార్యక్రమం నిర్వహించారు. వారు మాట్లాడుతూ నగరంలో అన్ని వార్డులను అభివృద్ధి చేస్తున్నామన్నారు. నగరంలో కాలనీల్లో ప్రాధాన్యతలను అనుసరించి మౌలిక వసతులు కల్పిస్తున్నామని చెప్పారు. గత ప్రభుత్వాలు నగర అభివృద్ధిని పట్టించుకోలేదన్నారు. వైఎస్సార్ సీపీ అధికారంలోకి వచ్చాక నగర పాలికకు ఎన్నికలు నిర్వహించడంతో పాలక వర్గం ఏర్పడిందన్నారు. పాలక వర్గం ఏర్పడడంతో నగరం అభివృద్ధిలో పయనిస్తుందన్నారు. గత టీడీపీ పాలనకు, ప్రస్తుత వైఎస్సార్‌సీపీ పాలనలో తేడాను ప్రజలు గమనించాలని కోరారు. చంద్రబాబు నాయుడు 2014లో 600పైగా హామీలు ఇచ్చి అధికారంలోకి వచ్చాక ప్రజలను మోసం చేశారన్నారు. ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి చెప్పిన వాటితో పాటు చెప్పనవి కూడా అమలు చేస్తున్నారని చెప్పారు. కార్యక్రమంలో డిప్యూటీ మేయర్ రేణుక, డీఏఏబీ చైర్మన్ మహేశ్వర్‌రెడ్డి, కార్పొరేటర్లు లక్ష్మిరెడ్డి, శ్వేతారెడ్డి, అరుణరెడ్డి, సుదర్శన్‌రెడ్డి, లక్ష్మీకాంతరెడ్డి, నారాయణరెడ్డి, నాయకులు భీమాశంకర్‌రెడ్డి, యూనస్, రంగారెడ్డి, డీఈ రవిప్రకాష్ నాయుడు, ఏఈ జనార్దన్ తదితరులు పాల్గొన్నారు.

పనులు పూర్తి చేయండి


బిర్లాగేట్ జంక్షన్ వద్ద వివరాలు అడిగి తెలుసుకుంటున్న కమిషనర్ భార్గవ్‌తేజ

కర్నూలు (టౌన్): నగర పాలక పరిధిలో జరుగుతున్న అభివృద్ధి పనులను ఈనెలాఖరు లోపు పూర్తి చేయాలని నగరపాలక కమిషనర్ భార్గవ్‌తేజ ఆదేశించారు. గురువారం బిర్లాగేట్ జంక్షన్, బళ్లారి చౌరస్తా వద్ద అండర్ పాస్ అభివృద్ధి పనులు, మౌర్య ఇన్ వద్ద స్ట్రీట్ స్కేపింగ్ పనులను కమిషనర్ పరిశీలించారు. అభివృద్ధి పనుల పురోగతిని ఇంజినీరింగ్ విభాగం ఈఈ షాకీర్ హుస్సేన్‌ను అడిగి తెలుసుకున్నారు.

ఆర్‌యూ విద్యార్థికి కాంస్య పతకం


విద్యార్థిని అభినందిస్తున్న వీసీ సుధీర్ ప్రేమ్‌కుమార్

కర్నూలు (టౌన్): ఇటీవల చండీఘర్ యూనివర్సిటీలో నిర్వహించిన అంతర్ విశ్వవిద్యాలయాల వెయిట్ లిఫ్టింగ్ పోటీల్లో రాయలసీమ యూనివర్సిటీకి చెందిన అబ్దుల్లా 61 కేజీల విభాగంలో కాంస్య పతకం సాధించాడు. గురువారం వర్సిటీలో వైస్ చాన్స్‌లర్ సుధీర్‌ప్రేమ్‌కుమార్ క్రీడాకారుడిని అభినందించారు. త్వరలో నిర్వహించనున్న ఖేలో ఇండియా విశ్వవిద్యాలయాల పోటీల్లో విజేతగా నిలవాలని ఆయన ఆకాంక్షించారు. కార్యక్రమంలో రిజిస్ట్రార్ ఆచార్య సుందరానంద పుచ్చ, స్పోర్ట్స్ కోఆర్డినేటర్ డాక్టర్ శివకిషోర్ పాల్గొన్నారు.

చురుగ్గా పెన్షన్ల పంపిణీ

కర్నూలు (టౌన్): నగరపాలక సంస్థ పరిధిలో ఫిబ్రవరి 1 వ తేదీ గురువారం పెన్షన్ల పంపిణీ చేపట్టారు. 136 సచివాలయాల పరిధిలో ఉదయం 7 గంటల నుంచి ఇంటింటికి వెళ్లిన వలంటీర్లు లబ్ధిదారులకు పెన్షన్ మొత్తం అందజేశారు. నగరంలో మొత్తం 34,232 పెన్షన్లు ఉన్నాయి. మొదటి రోజు 28,950 పెన్షన్ దారులకు రూ.8,76,89,000 పంపిణీ చేశారు.

పెన్షన్ మంజూరు చేయించిన ఎమ్మెల్యే

స్థానిక జొహరాపురంలో నివసిస్తున్న విజయలక్ష్మి కిడ్నీ సమస్యతో బాధపడుతున్న విషయం తెలుసుకున్న ఎమ్మెల్యే హఫీజ్‌ఖాన్.. 40వ సచివాలయం కన్వీనర్ అక్బర్ అలీ ద్వారా వివరాలు నమోదు చేసుకున్నారు. ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లి పెన్షన్ మంజూరు చేయించారు. గురువారం వలంటీర్ అరుణ్‌కుమార్.. అమీలియా ఆసుపత్రిలో డయాలసిస్ చేయించుకుంటున్న పెషెంట్ విజయలక్ష్మి వద్దకు వెళ్లి పెన్షన్ రూ.10 వేలు అందజేయడంతో ఆమె ఎమ్మెల్యేకు కృతజ్ఞతలు తెలిపింది.


విజయలక్ష్మికి పెన్షన్ అందజేస్తున్న వలంటీర్ అరుణ్

నగర రూపురేఖలు మారుస్తాం


కేసీ కెనాల్‌పై స్ట్రీట్ మార్కెట్‌ను ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే హఫీజ్ ఖాన్, మేయర్ బీవై రామయ్య

- అభివృద్ధి పనులను ప్రారంభించిన మేయర్, ఎమ్మెల్యేలు

కర్నూలు (టౌన్): నగరపాలక సంస్థ పరిధిలో రూ.కోట్లు విలువ చేసే అభివృద్ధి పనులు ముమ్మరంగా సాగుతున్నాయని, నగర రూపురేఖలే మారుస్తున్నామని మేయర్ బీవై రామయ్య, కర్నూలు ఎమ్మెల్యే హఫీజ్ ఖాన్ అన్నారు. నగరపాలక సంస్థ పరిధిలో కేసీ కెనాల్ స్ట్రీట్ మార్కెట్, ధర్మపేట వద్ద రూ.18 లక్షలు వెచ్చించి ఆధునిక మరుగుదొడ్లను వారు ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ నగరంలో గతంలో ఎన్నడూలేని విధంగా అభివృద్ధి పనులు జరుగుతున్నా తెలుగుదేశం నాయకులకు కనిపించకపోవడం వింతగా ఉందన్నారు. శాశ్వత అభివృద్ధి పనులు చేపట్టడమే గాక ప్రతి కాలనీలో సీసీ రోడ్లు, మురుగు కాల్వలు, కల్వర్టులు ఏర్పాటు చేస్తున్నామన్నారు. వీధి వ్యాపారుల నుంచి ఇబ్బందులు తలెత్తకుండా వారికి సౌకర్యాలు కల్పిస్తూ కేసీ కెనాల్, వాల్‌మార్ట్ ఎదురుగా, ఐటీసీ సర్కిల్ వద్ద స్ట్రీట్ మార్కెట్‌లను ఏర్పాటు చేశామన్నారు. స్మార్ట్ స్ట్రీట్‌లో భాగంగా నగరంలో ముఖ్య కూడళ్ల అభివృద్ధి, ట్రాఫిక్ సిగ్నల్స్, రహదారుల విస్తరణ చేపట్టామన్నారు. కార్యక్రమంలో డిప్యూటీ మేయర్లు సిద్దారెడ్డి రేణుక, నాయకల్లు అరుణ, వైఎస్సార్‌సీపీ నాయకులు రైల్వే ప్రసాద్, కార్పొరేటర్లు, పార్టీ నాయకులు పాల్గొన్నారు.

అభివృద్ధి పనుల పరిశీలన

నగరపాలక సంస్థ పరిధిలోని 49, 50, 51 వార్డుల పరిధిలో జరుగుతున్న అభివృద్ధి పనులను గురువారం సాయంత్రం ఎమ్మెల్యే హఫీజ్ ఖాన్ పరిశీలించారు. ఆయా వార్డులలో జరుగుతున్న డ్రైనేజీ, రోడ్లు, కల్వర్టు పనులను పరిశీలించి వేగవంతం చేయాలని చెప్పారు. కార్యక్రమంలో కార్పొరేటర్లు కృష్ణకాంత్ రెడ్డి, షేక్ మహమ్మద్, వైఎస్సార్‌సీపీ నాయకులు ఫరూక్, షేక్షావలి, సొహైల్, ఉస్మాన్, సలీం, ఎజాజ్, సమీర్, షాలి, రియాజ్, ఇబ్ర పాల్గొన్నారు.

ఫ్యామిలీ డాక్టర్‌తో ప్రజల ఇంటి ముంగిటకే వైద్యం

కోడుమూరు రూరల్: రాష్ట్ర ప్రభుత్వం అమలు చేస్తున్న ఫ్యామిలీ డాక్టర్ వైద్య సేవలతో ప్రజల ఇంటి ముంగిటకే వైద్య సేవలు అందుతున్నాయని జిల్లా వైద్య,ఆరోగ్య శాఖ అధికారి డా.రామగిడ్డయ్య అన్నారు. గురువారం కోడుమూరులోని గ్రామ సచివాలయం-4 పరిధిలో జరుగుతున్న ఫ్యామిలీ డాక్టర్ కార్యక్రమాన్ని డా.రామగిడ్డయ్య తనిఖీ చేశారు. ప్రజలకు అందుతున్న వైద్యసేవలను పరిశీలించడంతో పాటు, సిబ్బందికి సూచనలు ఇచ్చారు. ఈ సందర్భంగా డా.రామగిడ్డయ్య మాట్లాడుతూ ప్రతి ఇంటిని, కుటుంబాన్ని ఆరోగ్యపరంగా సురక్షితంగా ఉంచడంలో భాగంగా రాష్ట్ర ప్రభుత్వం ఫ్యామిలీ డాక్టర్ కార్యక్రమాన్ని చేపట్టిందన్నారు. డా.వైఎస్సార్ ఆరోగ్యశ్రీ కింద హాస్పిటల్స్‌లో వైద్య చికిత్సలు చేయించుకున్న వ్యక్తులతోపాటు దీర్ఘకాలిక వ్యాధులతో బాధపడుతున్న రోగుల వద్దకే వెళ్లి వైద్య పరీక్షలు చేయాలని సూచించారు. అనంతరం కోడుమూరులో నిర్మిస్తున్న ఆయుష్మాన్ ఆరోగ్య మందిర్ భవనాన్ని డా.రామగిడ్డయ్య సందర్శించి కరెంట్, నీటి కుళాయి కనెక్షన్ల త్వరగా వేయించాలని వైద్యాధికారి డా.శ్రీమంత్‌కు సూచించారు. కార్యక్రమంలో ఎంపీహెచ్ఈఓ నరసప్ప, హెల్త్ సూపర్‌వైజర్ కమాల్ సాహెబ్, కమ్యూనిటీ హెల్త్ ఆఫీసర్ లలిత జ్యోతి, ఏఎన్ఎం సుగుణమ్మ, ఆశా కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

కేసీ కాల్వకు నీటి విడుదల

గూడూరు: సుంకేసుల రిజర్వాయర్ నుండి కేసీ కాల్వకు గురువారం 159 క్యూసెక్కుల నీటిని విడుదల చేసినట్లు డ్యామ్ అధికారులు తెలిపారు. డ్యామ్‌లో 0.418 టీఎంసీల నిల్వ ఉన్నట్లు వారు పేర్కొన్నారు.